8 మంది యువ ఐపీఎస్‌ల బదిలీ

శేషాద్రినీరెడ్డి(ఐపీఎస్)

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 8 మంది యువ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు ఉండగా, ముగ్గురు 2021 బ్యాచ్‌కు చెందినవారు ఉన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని సీఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పరితోశ్ పంక్(2020)	భద్రాచలం ఏఎస్పీ	కొత్తగూడెం ఓఎస్డీ
సిరిసెట్టి సంకేత్ (2020)	ఏడీసీ గవర్నర్	గవర్నర్ ఓఎస్డీ
గీటె మహేశ్ బాబాసాహెబ్ (2020)	ఏటూరునాగారం ఏఎస్పీ	ములుగు ఓఎస్డీ
పాటిల్ కాంతిలాల్ సుభాష్ (2020)	భైంసా ఏఎస్పీ	సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ
అంకిత్‌కుమార్ శంఖావర్ (2020)	జనగామ ఏఎస్పీ	భద్రాచలం ఏఎస్పీ
అవినాశ్‌కుమార్ (2021)	అస్సాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్	భైంసా ఏఎస్పీ
శేషాద్రినీరెడ్డి (2021)	అస్సాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్	వేములవాడ ఏఎస్పీ
శివం ఉపాధ్యాయ (2021)	అస్సాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్	ఏటూరునాగరం ఏఎస్పీ

డీజీపీ కార్యాలయంలో నూతన చట్టాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవిగుప్తా

కొత్తచట్టాలపై అవగాహన కల్పించాలి: డీజీపీ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : కొత్తచట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీజీపీ రవిగుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డీజీపీ కార్యాలయంలో నూతన చట్టాలపై పోలీసులు రూపొందించిన పోస్టర్లు, సీఐడీ అభివృద్ధి చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖ రూపొందించిన తెలుగు, ఇంగ్లిష్ పోస్టర్లను అన్ని పోలీస్‌స్టేషన్లలో ప్రదర్శించాలన్నారు. కొత్త చట్టాలపై దర్యాప్తు అధికారులకు మార్గ నిర్దేశం చేసేందుకు సీఐడీ విభాగంలో ప్రత్యేకం సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సహకారంతో సీఐడీ రూపొందించిన సమగ్ర బుక్‌లెట్‌లో 43 ఎస్‌వోపీలు, 31 ప్రొఫార్మాలు ఉన్నాయని వెల్లడించారు. ఇందుకు సహకరించిన నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగెనవర్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతిని అభినందించారు. కొత్త చట్టాలపై రాష్ట్ర పోలీసులు పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ నేతృత్వంలో శిక్షణ పొందారని తెలిపారు. కొత్త చట్టాల మార్పును రాష్ట్రంలో సాంకేతికంగా పర్యవేక్షించిన ఏడీజీ శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సుధీర్‌బాబు, రమేశ్, గజరావు భూపాల్, డీఐజీలు, అధికారులు పాల్గొన్నారు.

వనమహోత్సవం ఆరంభశూరత్వమేనా?

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది హరిత వన మహోత్సవం అమలులో గందరగోళం నెలకొన్నది. శనివారం వరంగల్, హనుమకొండలో అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాల్లో ఎప్పటి నుంచి చేపట్టాలనే విషయంలో స్పష్టమైన షెడ్యూల్ లేకపోవడంతో అధికారుల్లో ఆయోమయం నెలకొన్నది. గతంలో హరితహారం కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన రోజే రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటేవారు. కానీ ఈ ఏడాది ప్రారంభించిన వనమహోత్సవంలో అలాంటి పరిస్థితిలేదు. మంత్రులు పలు అధికారిక కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ వనమహోత్సవాన్ని చేపట్టలేదు. జిల్లాల్లో కార్యక్రమాన్ని మొదలుపెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు గురుకులాల్లో ఒక్కో నిబంధన

- ఒకేసారి ఎంపికైనా తప్పని వ్యత్యాసాలు
- బేసిక్ పే చెల్లింపుల్లోనూ భారీ తేడాలు
- ప్రమోషన్లలో తీరని అన్యాయం
- ఏకరూప గైడ్‌లైన్స్ తేవాలని ఉద్యోగుల డిమాండ్

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 5 గురుకుల సొసైటీల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఒకే రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ అవుతారు.. వారందరికీ విధులు ఒకేలా ఉంటాయి.. కానీ, పాఠశాల ప్రారంభ వేళ నుంచి ప్రమోషన్లు, జీతభత్యాల్లో ఒక్కో విధమైన వ్యత్యాసం కనబడుతున్నది. ఫలితంగా ఎందరో ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురుకుల సొసైటీల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల సొసైటీల ఆధ్వర్యంలో 1,043 గురుకుల విద్యాలయాలు కొనసాగుతున్నాయి. ఆయా గురుకులాలు వేటికవే భిన్నమైన సర్వీస్ రూల్స్, గైడ్‌లైన్స్ పాటించడం వారికి శాపంగా మారుతున్నాయి. భిన్నమైన సర్వీస్ రూల్స్ వల్ల కొందరికి మోదం, మరికొందరికీ ఖేదంగా పరిణమించిందని ఉద్యోగులు వాపోతున్నారు. బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్ ఏర్పాటవుతున్న తరుణంలో పాతవాటికి భిన్నంగా వాటి నిర్వహణకు గైడ్‌లైన్స్ ఏర్పాటు చేసుకున్నాయి. జనరల్ గురుకుల సొసైటీ నుంచి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విడిపోతున్న తరుణంలో చాలామంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు బీసీ రెసిడెన్షియన్స్‌ను ఆప్షన్ ఎంచుకొని వెళ్లారు. ఆ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు వచ్చాయి. దీంతో జనరల్ గురుకులంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కంటే బీసీ రెసిడెన్షియల్‌కు వెళ్లిన జూనియర్లయిన చాలామంది ఉద్యోగులు ప్రమోషన్లతో లాభపడ్డారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రిన్సిపాల్స్ భర్తీ

సాధారణంగా స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులను 100 శాతం ప్రమోషన్ల ద్వారానే, ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారితోనే భర్తీ చేయాలి. గురుకుల సొసైటీల్లో అందుకు భిన్నమైన సర్వీస్‌రూల్స్ ఉన్నాయి. కొన్ని సొసైటీలు 70 శాతం పోస్టులను, మరికొన్ని సొసైటీలు 50 శాతం పోస్టులనే ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తూ మిగతా పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తున్నాయి. అదీగాక ఇన్‌సర్వీస్‌లో లేనివారికి సైతం అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

30 ఏండ్లయినా ప్రమోషన్ నిల్

సోషల్ వెల్ఫేర్ సొసైటీలో డీఎల్ పోస్టులను 70:30 నిష్పత్తిలో గాకుండా 30:70 నిష్పత్తిలో నింపుతున్నారని ఉద్యోగ సంఘాలు వెల్లడించాయి. ఈ కారణంగా ఒకే రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైనా ప్రమోషన్లు, బేసిక్ పేలో అన్యాయానికి గురవుతున్నామని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విభిన్న సర్వీస్‌రూల్స్ కారణంగా జనరల్ గురుకుల సొసైటీల్లో కొంతమంది ఉపాధ్యాయులు 30 ఏండ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోలేదని బాధిత ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

బేసిక్ పేలోనూ తీవ్ర అన్యాయం

టీజీపీఎస్సీ ద్వారా నియమితులైన గురుకుల ప్రిన్సిపాళ్లకు కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు ఆప్షన్ తీసుకున్న వారికి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు గ్రేడ్ 1 బేసిక్ పే చెల్లిస్తుండగా, అదే రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన ఇతర సొసైటీల ప్రిన్సిపాళ్లు మాత్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లుగానే విధులు నిర్వహిస్తూ స్కూల్ ప్రిన్సిపాల్ గ్రేడ్ 2 బేసిక్ పే మాత్రమే తీసుకుంటున్నారు. మూడేండ్లు దాటిన వారికీ గ్రేడ్1గా ప్రమోషన్లు ఇవ్వడం లేదు.

పనివేళల్లో చాలా వ్యత్యాసం

గురుకులాల పనివేళలల్లో కూడా చాలా వ్యత్యాసం ఉన్నది. జనరల్, బీసీ గురుకులాలు ఉదయం 7:30 నుంచి ప్రారంభమవుతుండగా, ఇతర సొసైటీ పాఠశాలలు 9.30 నుంచి ప్రారంభమవుతున్నాయి. మైనార్టీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో ప్రత్యేకంగా ఒక డిప్యూటీ వార్డెన్ ఉండగా, ఇతర సొసైటీల్లో ఒక ఉపాధ్యాయుడికి డిప్యూటీ వార్డెన్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని గురుకుల సొసైటీల్లో ఒకే విధమైన గైడ్‌లైన్స్ ఏర్పాటుచేసి అందరికీ సమన్యాయం చేయాలని, ఆ తర్వాతే ప్రమోషన్లు చేపట్టాలని వివిధ గురుకుల ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఇంటర్‌లో 'ఐఈ యాప్'
ఇక నుంచి ఆన్‌లైన్ పర్యవేక్షణ

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కళాశాలల పనితీరును పర్యవేక్షించేందుకు అధికారులు ఐఈ (ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీశాఖ రూపొందించిన ఈ యాప్ ద్వారా రోజువారీగా విద్యార్థుల హాజరు, అకడమిక్ క్యాలెండర్ అమలు, తనిఖీలు, అధ్యాపకుల పనితీరు, పాఠ్యపుస్తకాల ట్రాకింగ్ తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు. ఇటీవలే రెండు మల్టీజోన్లలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లకు రెండు రోజుల పాటు యాప్ పనితీరుపై అవగాహన కల్పించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రోజువారీగా వివరాలు నమోదుచేయాలని సూచించారు. రాష్ట్రంలో 422 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 78వేలకు పైగా సెకండియర్ విద్యార్థులుండగా, ప్రస్తుతానికి 40వేలకు పైగా విద్యార్థులు ఫస్టియర్‌లో చేరారు. 393 మంది ప్రిన్సిపాళ్లు, 3,671 మంది లెక్చరర్లు పని చేస్తున్నారు. కళాశాలలపై పర్యవేక్షణ పెంచడం ద్వారా విద్యాప్రమాణాలు పెంచే దిశలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

హైదరాబాద్, జూలై1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత ఉద్యోగ, ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 3నెలల వ్యవధితో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో, డయాలసిస్ టెక్నీషియన్ 4 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్, మేడ్చల్ (మల్కాజ్‌గిరి)లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న యువత 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98485 81100, 90599 02355 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

- రూ. లక్ష ఎల్‌వోసీ మంజూరు
- తక్షణమే వైద్య సాయం అందించాలని సీఎం ఆదేశం

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ, జూలై1: హనుమకొండ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ గోడు చెప్పుకుందామని కలెక్టరేట్‌కు తండ్రితో వచ్చిన క్యాన్సర్ బాధిత బాలుడు మహ్మద్ అదిల్ అహ్మద్ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ' కథనానికి సీఎం స్పందించారు. వెంటనే బాలుడికి వైద్య సహాయం అందించాలని సీఎంవో అధికారులను సీఎం ఆదేశించారు. చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ దవాఖానకు సీఎంవో రూ. లక్ష ఎల్వోసీ మంజూరు చేసింది. సీఎంఆర్ఎఫ్ ద్వారా మరింత సాయం అందిస్తామని సీఎం ఓఎస్డీ శ్రీనివాస్ అదిల్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌కు ఓటేసినందుకు చచ్చిపోతున్నా

మొదటిపేజీ తరువాయి...

అంటూ ఓ రైతు సెల్‌ఫోన్‌లో ఓ వీడియో చిత్రీకరించి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్(43) పురుగుల మందు డబ్బా పట్టుకొని తన బాధను ఓ వీడియోలో ఈ విధంగా చెప్పుకొచ్చాడు. ప్రొద్దుటూరు రెవెన్యూ సర్వే నంబర్ 276, 277లో గల బోజడ్ల ప్రభాకర్, బోజడ్ల వీరభద్రయ్య భూమిలో సమీప చెరువు నుంచి మొరం తొలిచారు. అదే గ్రామానికి చెందిన కూరపాటి కిశోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశ్వరరావు, మొగిలి శ్రీను, మొగిలి ముత్తయ్య ప్రోద్బలంతో కొందరు వ్యక్తులు కక్షపూరితంగా తన పొలంలోని మట్టిని జేసీబీలు, ప్రొక్లెయిన్లతో చెల్లాచెదురు చేసి నాశనం చేశారని ప్రభాకర్ విలపించాడు. తహసీల్దార్ రమేశ్, ఎస్సై షేక్ నాగుల్‌మీరాకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని విలపించాడు. కలెక్టర్ కోసం సోమవారం కలెక్టరేట్‌కు వస్తే సమయం అయిపోయిందని సిబ్బంది చెప్పారని దీంతో పురుగుల మందు తీసుకున్నానని విలపిస్తూ చెప్పాడు. ఆ వీడియోను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చేరవేయాలని కోరుకున్నాడు. తన 7ఎకరాల 10గుంటల్లో 3ఎకరాలను పూర్తిగా సర్వనాశనం చేశారని వాపోయాడు. రైతురాజ్యం వస్తుందని తాను కాంగ్రెస్‌కు ఓటు వేశానని, ఇదేనా నాకు చేసిన న్యాయం అని బోరుమన్నాడు. తాను చనిపోయాక తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పురుగు మందు డబ్బా పట్టుకొని రెండు చేతులు జోడించి కన్నీళ్లు పెడుతూ ప్రాధేయపడ్డాడు. ప్రభాకర్ ఖమ్మం సమీపంలోని ఓ మామిడి తోట దగ్గరలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న కొందరు ప్రభాకర్ సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రభాకర్‌ను దవాఖానకు తరలించేలోపే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అధికారులు ఆరా తీస్తున్నారు.

- ఎంజీఎంలో నిర్లక్ష్యం.. ఫిర్యాదుల బాక్సే సాక్ష్యం

దవాఖానలో ఉన్న సమస్యలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు చేయడానికి వరంగల్ ఎంజీఎంలో ఓ కంప్లైంట్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. చాలా మంది తమ ఫిర్యాదులను ఆ బాక్స్‌లో వేయగా.. వాటిని తీసేవారు కరువయ్యారు. కొన్ని రోజులుగా బాక్స్‌ను తెరవకపోవడంతో ఫిర్యాదు పత్రాలన్నీ బయటకొస్తున్నాయి. ఈ విషయమై.. సోషల్ మీడియాలో 'నిండిపోయిన ఫిర్యాదుల బాక్స్' అంటూ వైరల్ అవుతున్నది. -కాశీబుగ్గ

గరం గరం జూన్ నెల

- 1901 తర్వాత ఇదే తొలిసారి
- జూన్‌లో 11శాతం లోటు వర్షపాతం

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): జూన్‌లో దేశంలోకి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ అత్యంత వేడి నెలగా జూన్ రికార్డులకెక్కింది. 1901 తర్వాత జూన్‌లో 31.73 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతతో అధిక ఉష్ణోగ్రత నమోదైంది. వాయవ్య భారతంలో జూన్ సగటు ఉష్ణోగ్రత సాధారణం కంటే 1.65 డిగ్రీలు అధికమని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్రా తెలిపారు. జూన్‌లో తెలంగాణలో స్వల్పంగా 26 మి.మీ అధిక వర్షపాతం నమోదవ్వగా.. దేశంలో 11 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఐదేండ్లలో ఇదే అధికమని భారత వాతావరణశాఖ సోమవారం తెలిపింది. ఐఎండీ లెక్కల ప్రకారం.. జూన్‌లో సాధారణ వర్షపాతం 165.3 మి.మీ ఉండగా..దేశవ్యాప్తంగా 147.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

కొనసాగుతున్న అల్పపీడనం

అల్పపీడనం ప్రభావంతో మరో 3 రోజులు ఈదురుగాలులు, మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో 5.48 సెం.మీ అధికవర్షపాతం నమోదైంది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి, జగిత్యాల, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, కొమురంభీం, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసింది.

బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎత్తివేత • జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు నీటి విడుదల

ముప్కాల్, జూలై 1: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సోమవారం ఎత్తారు. జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు గేట్లు తెరిచి ఉంచాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు గేట్లను పైకి ఎత్తారు. తెలంగాణ, మహారాష్ట్రతోపాటు సీడబ్ల్యూసీ ప్రతినిధుల సమక్షంలో 14 గేట్లను తెరిచారు. బాబ్లీలో ఉన్న 0.2 టీఎంసీల నీరు దిగువకు వస్తున్నదని ఎస్సారెస్పీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, నాందేడ్ ఈఈ చక్రపాణి, ఏఈఈ బన్సద్, ఏఈఈ వంశీ, సతీశ్ పాల్గొన్నారు.

మేడిగడ్డ మరమ్మతులకు వరద బ్రేక్

ఖరీఫ్‌లో వర్షంపైనే ఆధారం.. తల్లడిల్లుతున్న అన్నదాతలు

జయశంకర్ భూపాలపల్లి, జూలై 1 (నమస్తే తెలంగాణ): ఎగువన కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో టెస్టింగ్ పనులకు బ్రేక్ పడింది. ప్రాణహిత నది ప్రవాహం ఎక్కువ కావడంతో మేడిగడ్డ వద్ద పనులు ముందుకెళ్లడం లేదు. ఎప్పటికప్పుడు నీటిని వదులుతున్నప్పటికీ గేట్ల వద్ద పేరుకుపోతున్న నీటితో పనులు నిలిచిపోయాయి. సీసీ బ్లాకుల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. నిర్మాణ సంస్థలు చేతులెత్తేశాయి. నారు పోసే దశలో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అన్నారం, సుందిళ్ల నుంచి 500 క్యూసెక్కుల వరద, మేడిగడ్డ నుంచి 11,740 క్యూసెక్కుల ప్రాణహిత నీరు ప్రవహిస్తుండగా అంతే నీటిని కిందికి పంపుతున్నారు. మేడిగడ్డలో కరకట్టను అధికారులు తొలగిస్తున్నారు.

విద్యుత్తు కమిషన్ విచారించవచ్చు

- పక్షపాత ఆరోపణలకు ఆధారాల్లేవు
- కమిషన్ విచారణను నిలిపివేయలేం
- కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూలై 1, (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ పవర్ స్టేషన్ల ఏర్పాటులో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపే పరిధి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్‌కు ఉన్నదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలకు చెందిన అంశాలపై చట్టం ప్రకారం విశ్వసనీయ వ్యక్తులతో కమిషన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాలకు అధికారం ఉన్నదని తెలిపింది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై న్యాయపరమైన వ్యవస్థలైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండళ్లు తేల్చిన అంశాలపై విచారణ జరిపే పరిధి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు లేదన్న మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు వాదన ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ఈఆర్సీల పరిధికంటే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ పరిధి విస్తృతమని తెలిపింది. కాబట్టి ఈఆర్సీలు తేల్చిన అంశాలపై విచారించే పరిధి కమిషన్‌కు లేదన్న వాదనతో ఏకీభవించలేమని పేర్కొంది. జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాతంతో ఉన్నారనడానికి కేవలం మీడియా సమావేశంలో చేసిన ప్రకటన తప్ప ఇతర ఆధారాలను కేసీఆర్ చూపలేదని పేర్కొంది. నరసింహారెడ్డి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని నిరూపించడంలో కేసీఆర్ విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. విద్యుత్తు కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడానికి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం మార్చి 14న ఇచ్చిన జీవో 9ని సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన బెంచ్ విచారణ జరిపింది. అనంతరం సోమవారం 22 పేజీల తీర్పును వెలువరించింది.

కమిషన్ ఏర్పాటు చేయవచ్చు

విచారణ కమిషన్ల చట్టం- 1952 కింద కొన్ని అధికారాలతో ప్రభుత్వాలు కమిషన్‌ను ఏర్పాటు చేయవచ్చని, ఈ చట్టం కింద వాస్తవ నిర్ధారణ కమిషన్ మాత్రమే ఏర్పాటవుతుందని హైకోర్టు పేర్కొంది. నివేదిక సమర్పించడం వరకే కమిషన్ల బాధ్యత అని, దాన్ని అమలుచేయాలని కోరే అధికారం లేదని తెలిపింది. ప్రజాప్రయోజనాలకు చెందిన సున్నితమైన అంశాలను సాధారణ దర్యాప్తు సంస్థలకు అప్పగించిన పక్షంలో అనుమానాలు తలెత్తే అవకాశం ఉన్నందున కమిషన్‌తో విచారణ చేయించవచ్చని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పేర్కొన్నదని గుర్తుచేసింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ విద్యుత్తు సంస్థల మధ్య 2015 సెప్టెంబర్ 22న విద్యుత్తు కొనుగోలు ఒప్పందం జరిగిందని, దీనిపై పలువురు ఎస్ఈఆర్సీని ఆశ్రయించగా, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి యూనిట్ రూ.3.90గా నిర్ణయిస్తూ 2017 మార్చి 31న ఉత్తర్వులు జారీచేసిందని తెలిపింది. ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ 2018 జులై 7న టారిఫ్ నిమిత్తం ప్రాజెక్టు ఖర్చును నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా తెలంగాణ విద్యుత్తు సంస్థలు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయని పేర్కొంది. పిటిషన్‌లోని అంశాల ప్రకారం.. ప్రాజెక్టు ఖర్చు, టారిఫ్ నిర్ణయాలపై మాత్రమే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఎస్ఈఆర్సీలు విచారణ జరిపినట్టు తేలుతున్నదని పేర్కొంది. నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటు విధివిధానాలను పరిశీలిస్తే ఈ వ్యవహారాలపై నిర్ణయాల్లోని లోపాలు, అవి చూపే ఆర్థిక ప్రభావంపై కూడా అధ్యయనం చేయాల్సి ఉందని తెలిపింది. ఈఆర్సీలు తేల్చిన అంశాలకంటే విస్తృతమైనవి, ఆ కమిషన్లు తేల్చిన అంశాలను ఇందులో చేర్చలేదని పేర్కొంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీలు తేల్చిన అంశాలపై విచారించే పరిధి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు లేదన్న వాదనను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది.

పక్షపాతానికి ఆధారాల్లేవు

కేసీఆర్ పిటిషన్‌పై కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డికి నోటీసు జారీ చేసేముందు పక్షపాతంతో వ్యవహరించారన్న ఆరోపణపై ప్రాథమికంగా ఈ కోర్టు సంతృప్తి చెందాల్సి ఉన్నదని ధర్మాసనం పేర్కొంది. జూన్ 11న నరసింహారెడ్డి తమ కమిషన్ విచారణ స్థితిని వివరించడానికి విలేకరుల సమావేశం నిర్వహించారని, ముందుగానే పక్షపాతంతో ఓ నిర్ణయానికి వచ్చేశారని కేసీఆర్ ఆరోపించారని తెలిపింది. 'తన ముందున్న సమాచారం ఆధారంగా కమిషన్ వాస్తవాలను నమోదు చేయాలని, అంతేగా కుండా కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తి ప్రధాన న్యాయమూర్తిగా రాజ్యాంగ విధులు నిర్వహించారన్న విషయాన్ని విస్మరించలేమని వ్యాఖ్యానించింది.. విలేకరుల సమావేశం నిర్వహించి ప్రకటన ఇచ్చారన్న కారణం తప్ప వేరే సమాచారం లేదని, పక్షపాతమని ఊహించి చెప్పరాదని, దాన్ని నిరూపించాల్సి ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప